

విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి : సిపిఎం



తిరుపతి టౌన్ : విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, అధిక ధరలను నియంత్రించాలని సిపిఎం ఆధ్వర్యంలో బిటిఆర్ కాలనీలో సమరభేరి నిరసన తెలిపారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సచివాలయ సెక్రటరీకి అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ వరకూ సమరభేరికి పిలుపునిచ్చిందన్నారు. విద్యుత్ ఛార్జీల బాదుడు ఆపాలని, చెత్త పన్ను వేయరాదని, ఆస్తి విలువ ఆధారంగా పన్నులు పెంచొద్దని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.రాధాక్రిష్ణ, ఎస్‌కె బాదుల్లా, నిమ్మనపల్లి మునిరత్నం, హమీద్, దేవానంద్, ముజఫర్, వెంకటేష్, వాసు పాల్గొన్నారు.

'సూర్యుని' చుట్టేందుకు...!

ఆదిత్య ఎల్1 ప్రయోగం విజయవంతం



ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూర్యుని చుట్టూ వాతావరణ పరిస్థితులపై పరిశోధనలు చేసేందుకు రూపొందించిన 'ఆదిత్య ఎల్ 1' శ్రీహరికోట షార్ నుంచి శనివారం ఉదయం 11.50 నిమిషాలకు నిప్పులు చిమ్ముతూ అంతరిక్షం వైపు పిఎస్‌ఎల్‌వి సి-57 రాకెట్ ద్వారా దూసుకెళ్లింది. ప్రయోగం అనంతరం 63 నిమిషాల 30 సెకండ్ల తరువాత ఆదిత్య ఎల్1 మిషన్‌ను నిర్దిష్ట కక్షలో పిఎస్‌ఎల్‌వి సి-57 రాకెట్ వదిలిపెట్టింది. సూర్యునిపై పరిశోధనలు జరపడమే ఆదిత్య ఎల్1 మిషన్ ప్రయోగ ముఖ్య లక్ష్యం. దీనికోసం ఇందులో ఏడు సైంటిఫిక్ పరికరాలను అమర్చారు. 1475 కిలోల బరువు కలిగిన మిషన్ సూర్యుని సమీపానికి చేరుకోడానికి 1.5 మిలియన్ల కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. 125 రోజుల సమయం పడుతుంది. ఆదిత్య లాంటి మిషన్లను ఇప్పటికే అమెరికా, జర్మనీ, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీలు పంపి ఉన్నాయి. ఆదిత్య ఎల్1లోని ఏడు పేలోడ్స్‌లో నాలుగు నేరుగా సూర్యునిపై పరిశోధనలు చేస్తాయి. మిగిలిన మూడు సౌర రేణువులు, అయస్కాంత క్షేత్రాలపై పరిశోధనలు చేస్తాయి. ఐదు పేలోడ్స్‌ను ఇస్రో సారథ్యంలో తయారు చేశారు. మరో రెండు ఇస్రో సహకారంతో భారతీయ విద్యాసంస్థల ద్వారా రూపొందించారు. ఆదిత్య ఎల్1 మిషన్ 16 రోజుల పాటు భూకక్షలో తిరుగుతూ ఉంటుంది. భూమిచుట్టూ నాలుగుసార్లు తిరిగిన తరువాత సూర్యుని వైపుకు ప్రయాణిస్తుంది.

ఇస్రో శాస్త్రవేత్తలకు శ్రీసిటీ ఎండి అభినందనలు


వరదయ్యపాలెం : పిఎస్‌ఎల్వీ-సీ57 రాకెట్ ప్రయోగం విజయవంతం అయినందుకు శ్రీసిటీ వ్యవస్థాపక నిర్వాహక సంచాలకులు డా. రవీంద్ర సన్నారెడ్డి హర్షం వెలిబుచ్చారు. ఈ ప్రయోగం ద్వారా ఆదిత్యా-ఎల్1 ఉపగ్రహాన్ని నిర్ణీత దీర్ఘ వత్తాకార ప్రారంభ కక్ష్యలోకి పంపడంలో విజయం సాధించినందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అద్యక్షులు కే. సోమనాథ్ కు, షార్ డైరక్టర్ ఏ. రాజరాజన్ కు, షార్ శాస్త్రవేత్తలకు , ఇతర ఉద్యోగస్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

ఆదిత్య ఎల్1 విజయం సాధించాలి

గూడూరు టౌన్‌లో.. : రెండవ పట్టణ పరిధిలోని వి. యస్ .ఆర్ పాఠశాల విద్యార్థులను ఇస్రోను అభినందించారు. శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టిన ఆదిత్య ఎల్-1 సూర్యునిపై ప్రయోగం విజయం సాధించాలని వి.యస్.ఆర్ పాఠశాల విద్యార్థులు త్రివర్ణ పతాకాన్ని ఎగరావేస్తూ ఇస్రో ఆకారంలో నిలబడి ఇస్రో శాస్త్రవేత్తలకు ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నందిమండలం బాలకష్ణం రాజు , కరెస్పాండంట్ అన్నపూర్ణ, ప్రిన్సిపాల్ శాంతకుమార్ పాల్గొన్నారు.

17న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ప్రజాశక్తి -తిరుమల



భక్తుల్లో భక్తునిగా..

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 18 నుంచి 26వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకోసం సెప్టెంబరు 17న అంకురార్పణ జరగనుంది. 12న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. వాహనసేవలు ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు జరుగుతాయి. 18న బంగారు తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహనం, పెద్దశేష వాహనం, 19న చిన్న శేష వాహనం, హంస వాహనం, 20న సింహ, ముత్యపుపందిరి వాహనం, 21న కల్పవృక్ష, సర్వభూపాల వాహనం, 22న మోహినీ అవతారం, గరుడసేవ 23న హనుమంత, స్వర్ణరథం, గజ వాహనం, 24న సూర్యప్రభ, చంద్రప్రభ, 25న రథోత్సవం, అశ్వవాహనం 26న పల్లకీ ఉత్సవం, చక్రస్నానం, ధ్వజావరోహనం నిర్వహిస్తారు.

వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో సామాన్య భక్తునిలా..

సామాన్య భక్తుడి వలే వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తులతో కలిసి టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి స్వయంగా పరిశీలించారు. మెటల్ డిటెక్టర్ ద్వారా స్వయంగా తనిఖీలు చేయించుకున్నారు. సామాన్యులకు అందుతున్న ఆహారం, తాగునీరు, కాఫీ, టీ వంటి ఆహారం సకాలంలో అందుతున్నదీ లేనిదీ ఆరా దీశారు. భక్తులకు సరిపడా పెట్టాలని సిబ్బందికి సూచించారు. టోకెన్‌లేని భక్తులను 47 కంపార్ట్మెంట్లనుంచి దర్శనానికి పంపినట్లు విజిలెన్స్ అధికారులు వివరించారు. 14 గంటల సమయం పడుతుందని తెలిపారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు : ఆర్డీవో

ప్రజాశక్తి - గూడూరు రూరల్



విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని గూడూరు ఆర్డీఓ ఎం. కిరణ్ కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని హెచ్ డీ ఎరీనా ఇండోర్ స్టేడియంలో వైజీఎస్బీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్స్ షటిల్ బాడ్మింటన్ పోటీలను ఆర్డీఓ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డుకాదన్నారు. కటిక పేదరికం నుండి కేవలం చదువుతోనే డిప్యూటీ కలెక్టర్ స్థాయికి ఎదిగానని తెలిపారు. గురువులు, తల్లిదండ్రులు, స్నేహితులను గౌరవించాలన్నారు. చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. పట్టుదలతో ఆడి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మహాభారతంలోని కొన్ని ఘట్టాలను ఉదహరించి జీవతాలను ఉజ్వలంగా తీర్చిదిద్దుకునే అవకాశం విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. సమాజానికి ఉనహపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వైజీఎస్బీఏ గౌరవాధ్యక్షులు చేవూరు విజయ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ వైజీఎస్బీఏ ఏర్పాటు చేసి షటిల్ క్రీడల అభివద్ధికి దోహదపడుతున్నామని తెలిపారు. గూడూరు క్రీడాకారుడు జాతీయ స్థాయిలో 3వ ర్యాంకులో కొనసాగుతుండడం పట్టణానికే కాకుండా ఈ రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఎల్‌ఏపీ స్కూల్ కరెస్పాండెంట్ బీ. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గూడూరులో అన్ని వసతులతో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసిన హర్ష, దీపులను అభినందించారు. వైజీఎస్బీఏ అధ్యక్షులు షేక్. జమాలుల్లా మాట్లాడుతూ ఆర్డీఓ సేవలు ఆనిర్వచనీయమన్నారు. షటిల్ టోర్నమెంట్ ఆహ్వానించేందుకు వెళితే రెట్టింపు ప్రైజ్ మనీ ఇచ్చి క్రీడాకారుల అభివద్ధికి దోహదపడ్డారని కతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిర్వహించిన స్కూల్ స్థాయి షటిల్ క్రీడా పోటీలు హెూరాహెూరీగా సాగాయి. ఈ సమావేశంలో వైజీఎస్బీఏ గౌరవాధ్యక్షులు చేవూరు విజయ్ మోహన్ రెడ్డి, ఎల్‌ఏపీ స్కూల్ కరెస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి, హెూటల్ మహేంద్ర ఎలైట్ అధినేత కోట రామారావు, వైజీఎస్బీఏ అధ్యక్షులు జమాలుల్లా, ప్రధాన కార్యదర్శి గిరిబాబు పాల్గొన్నారు.

భక్తుల భద్రత సరే... కార్మికులకు రక్షణ ఏది?

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజా'దృష్టి'

తిరుపతి ప్రపంచ ప్రఖ్యాతగాంచిన ఆధ్యాత్మిక నగరం. తిరుమల గిరులు నిత్యం గోవిందనామ స్మరణలతో మారుమ్రోగుతూనే ఉంటుంది. అలాంటి తిరుమల నేడు పలు వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. మత ఛాంధస్తులు మళ్లి మత వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చారు. శేషచల అడవులు నల్లమల్ల అడవులకు అనుసంధానంగానే ఉంటాయి. ఇక్కడ జంతువులు తిరగాడడం మామూళ్లే. కానీ ఇటీవల జరిగిన కొన్ని కారణాలు భక్తుల భద్రతపై అనుమానాలను రేకెత్తించింది. వరస ఘటనలపై టిటిడి యాజమాన్యం స్పందించి తీసుకున్న కర్రల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోషల్ మీడియా కోడై కూస్తోంది. ఏకంగా టిటిడి పెద్దలు పరోక్షంగా ఓ సభ నిర్వహించి, వివరణ ఇచ్చుకునే స్థాయికి విమర్శలు రేగాయి. అయినా కర్రల కొర్రీ వ్యవహారం ఇంక మానకపోవడం గమనార్హం.

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లాలంటే అంజనాద్రి, వెంకటాద్రి, నీలాద్రి, శేషాద్రి, వృషబాద్రి, గరుడాద్రి, నారాయణాద్రి పేరులతో పిలుస్తున్న కొండలను తప్పకుండా దాటిల్తిందే. అది రోడ్డు మార్గాన కానీ, నడక మార్గాన కానీ. ఈ కొండల మొత్తం కీకారణ్యం. తమిళనాడులోని కన్యాకుమారి నుంచి సైతం కాలినడకతో తిరుమలకు భక్తులు వస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి తిరుపతికి చేరుకునే భక్తులు తిరుమలకు వెల్లేందుకు ప్రధాన మార్గం అలిపిరి. అలిపిరి నుంచి నిత్యం వేలాది మంది భక్తులు తిరుమలకు నడిచి వెళ్లతుంటారు. అలిపిరి-తిరుమల మధ్య దూరం 9 కిలోమీటర్లు. అలిపిరి పాదాల మండపం నుంచి శుక్లాగిరిపర్వతం వరకు ఉన్న దూరం ఒకటిన్నార కిలోమీటరు. ఇది మొత్తం మెట్ల మార్గమే. తిరుమలకు చేరుకునే దగ్గర మోకాల పర్వతం నుంచి మరో కిలోమీటరు దూరం మెట్లు మార్గమే. 9 కిలోమీటర్ల దూరంలో 3 కిలోమీటర్లకు పైగా నిత్యం జనసంచారం ఉండే ప్రాంతమే. మిగిలిన 6 కిలోమీటర్లు చిన్నచిన్న ఎత్తుపల్లాలతో సాగే మార్గం. ఇందులో 3 కిలోమీటర్లు మాత్రం కీకారణ్యం. ఇక్కడ జంతువుల తచ్చాడుతుంటాయి. ఇందులో క్రూరమృగాలైన చిరుతుల, ఎలుగుబంట్లు కూడా ఉన్నాయి. తరుచు అప్పడప్పడు నడకమార్గంలో, రోడ్డు మార్గంలో చిరుత, ఎలుగుబంట్లు భక్తులకు అగుపిస్తున్నా ఎప్పడు ఎలాంటి ఇబ్బంది కల్గలేదు. కానీ రెండు నెలల కాలంలో వరసుగా జరిగిన రెండు ఘటనలు అటు భక్తులను, ఇటు స్థానికులను హడలెత్తించాయి. మొదటగా చిరుత పులి ఓ బాలుడిని నోటుకరుచుకుని వెళ్ళుతుంటే భక్తులు, సెక్యూరిటీ సిబ్బంది కాపాడారు. రెండోసారి అ సమీప ప్రాంతంలో మరోసారి చిరుత సంచరించి, ఓ బాలికను చంపేసింది. దీంతో టిటిడి ఉలిక్కిపడింది. తిరుమల నడక మార్గంలో నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు పూనుకుంది. దీంతో పాటు భక్తులకు కర్రలు ఇచ్చేందుకు పూనుకుంది. నడిచి వెళ్లే భక్తులు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే అనుమతి, అందులోనూ 15 సంవత్సరాల లోపు వయస్సున్న పిల్లలను మధ్యాహ్నం 2 గంటల వరకు అనుమతి ఇస్తూ చర్యలు చేపట్టారు. దీనికి తోడు నడిచివెళ్లే ప్రతి భక్తుడికి 50 రూపాయలు డిపాజిట్ చేస్తే చేతికర్ర ఇవ్వడం మొదలు పెట్టారు. ఇది కాస్త వివాదస్పదం అయింది. క్రిస్టియన్ మతాన్ని ఆచరించే వ్యక్తి చైర్మన్ అయ్యాడని, భక్తుల మనోభావాలు దెబ్బతిసేలా చర్యలు తీసుకుంటున్నారని విమర్శలు చేయడం మొదలు పెట్టారు. ఓ చేతికర్ర పులినుంచి కాపాడుతుందా అంటూ ఎద్దేవా చేశారు. దీన్నిపై స్పందించిన టిటిడి చైర్మన్, ఈవో తిరుపతి వేదికగా జరిగిన ఓ సభలో పరోక్షంగా వారి చర్యలను సమర్థిస్తూ, నెట్‌జన్ల విమర్శలను తిప్పికొట్టారు. ఇదంతా భక్తుల భద్రతలో బాగమే అంటూ కొట్టిపారేశారు. అంతా సరి... భక్తుల భద్రత చేపట్టారు. కానీ నిత్యం కారడివిలో ఎలాంటి ఆయుధాలు లేకుండా ఒంటరిగి విధులు నిర్వహిస్తూ రాత్రనక పగులనక కీకారణ్యంలో పని చేసే అటవీకార్మికుల పరిస్తితి ఏంటి. వారివి ప్రాణాలు కావా..? వందలాది మంది కార్మికుల రక్షణ మాత్రం గాలికొదిలేయడం విడ్డూరం. తమ ప్రాణాలను పణంగా పెట్టి శేషచల అడవుల్లో పచ్చదనాన్ని కాపాడుతున్న అటవీకార్మికులకు క్రూర జంతువుల నుంచి రక్షణ కల్పించాలని పలువురు మానవతవాదులు కోరుకుంటున్నారు. టిటిడి ఆ దిశగా కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.







చిరస్మరణీయుడు 'రాజన్న'

అట్టహాసంగా వైఎస్ వర్ధంతి
నివాళులు, అన్నదానాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజవేఖర్‌రెడ్డి ప్రజాభివృద్ధి ఆశయాలను అందరూ ఆచరిద్దామని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి అట్టహాసంగా జరిగింది. వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు, అన్నదానం చేశారు.

తిరుపతి తుడా కార్యాలయం వద్ద వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భూమన్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అందరి గుండెల్లో చిరస్మరణీయుడుగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, అభినయ్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కడప జిల్లా ఇడుపులపాయకు వెళ్లి రాజన్న ఘాట్ వద్ద భూమన్ నివాళి అర్పించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డిని పలకరించారు.

క్యాంపస్‌లో.. వైఎస్‌ఆర్ విద్యార్థిసంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి.ఓబుల్‌రెడ్డి, రీజినల్ కోఆర్డినేటర్ ఎల్.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్వీయూ వీసీ ఆచార్య కె.రాజారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రజల గుండెల్లో మానవతామూర్తిగా వైఎస్ నిలిచిపోయారన్నారు. విద్యా, వైద్యరంగాలకు ఎనలేని సేవలందించారన్నారు. రిజిస్ట్రార్ హుస్సేన్, పాలకమండలి సభ్యులు సీకాం సురేంద్రరెడ్డి పాల్గొన్నారు. ప్రకాశం భవన్ వద్ద ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

గాంధీరోడ్డులోని వైఎసఆర్ ప్రజాప్రస్తావన సేవా ట్రస్టు ఛైర్మన్ పిసిరాయల్ ఆధ్వర్యంలో సభ జరిగింది. ఎన్నారై ఎపి సలహాదారులు జ్ఞానేంద్రరెడ్డి, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు పోకల అశోక్‌కుమార్, ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్ పాల్గొన్నారు. 500 మంది పేదలకు అన్నదానం చేశారు. గొడుగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్ శ్రీదేవి, బండి మధుసూదన్‌రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

నాయుడుపేటలో.. సూళ్లూరుపేట ఎంఎల్ఎ కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్‌ఛైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి, ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి పాల్గొన్నారు. **కెవిబిపురంలో..**ఎంపిపి గవర్ల కృష్ణయ్య, మునిలక్ష్మి నందకుమార్ ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేసి అన్నదానం నిర్వహించారు. **ఏర్పేడులో...** ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, వైఎస్‌ఆర్‌సిపి ఇన్‌ఛార్జి గున్నేరు కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నల్లపాలెం శివయ్య పాల్గొన్నారు. పాపానాయుడుపేటలో సర్పంచి మేకలత్తూరు లలితా కరుణాకర్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. **కోటలో..** నాయకలు షేక్ మొబీన్‌బాష, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. క్రాస్‌రోడ్డు, చిట్టేడు, కేశవరం, కర్లపూడి గ్రామాల్లోనూ చిత్రపటానికి పూలమాల వేశారు. చేవూరి నాగేశ్వరరావు, ఎంపిపి దాసరి అంజమ్మ, జడ్‌పిటిసి దాసరి కోటయ్య, చిట్టేడు పిఎసిఎస్ ఛైర్మన్ పుట్టా నారాయణ పాల్గొన్నారు. **రామచంద్రాపురంలో..** తుడ ఛైర్మన్ మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నెన్నూరులో జరిగింది. వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ఎద్దుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిపి బ్రహ్మానందరెడ్డి, జడ్‌పిటిసి ఢిల్లీరాణి పాల్గొన్నారు. **తొట్టంబేడులో...** జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి కలవగుంట భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆలిండియా కమిటీ కార్యదర్శి వీసీ వెంకటయ్య, ధనశేఖర్, మునిశేఖర్ పాల్గొన్నారు. **వెంకటగిరిలో..** నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేశారు. రైతులకు పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం జలయజ్ఞం పేరుతో అనేక ప్రాజెక్టులను నిర్మించి సాగునీరు అందించిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి దక్కిందన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్క భానుప్రియ, వైస్‌ఛైర్మన్ బాలయ్య, చేనేత రాష్ట్ర కమిటి సభ్యులు నక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **పుత్తూరు టౌన్‌లో...** రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్వేటినగరం కూడలి అంబేద్కర్ సర్కిల్ వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బ్యానర్‌పెట్టి అన్నదానం చేశారు. మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి, వైస్‌ఛైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఎంపిపి మునివేలమ్మ పాల్గొన్నారు. **బాలాయపల్లిలో...** దేవిక చౌదరి, జయంపు సహకార సంఘం అధ్యక్షులు కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. **రేణిగుంటలో...** పట్టణ అధ్యక్షులు ప్రభాకర్ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎంపిపి కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జడ్‌పిటిసి సంధ్యారాణి పాల్గొన్నారు. **బిఎన్ కండ్రిగలో...** సీనియర్ నాయకులు జొన్నల గోపాల్‌రెడ్డి, ఉగ్గుమూడి గురునాధం, పుత్తూరు మాజీ సర పంచి గురవయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. నీర్పాకోట గ్రామంలో మండల కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. **గూడూరు టౌన్‌లో..** యుగపురుషుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ఎంఎల్ఎ వరప్రసాద్ అన్నారు. శాంతినగర్ వద్ద ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వైసిపి సీనియర్ నాయకులు బత్తిని విజయ్‌కుమార్, బొమ్మిడి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. డాక్టర్ వైఎస్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు బత్తిని విజయకుమార్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. **శ్రీకాళహస్తిలో..** ట్రస్టు బోర్డు ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షులు మిద్దెల హరి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి తనయుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి పాల్గొన్నారు.









పులిచర్ల, రొంపిచెర్ల మండలాలు తిరుపతిలోకి..

'పట్టు' కోసం 'పెద్దిరెడ్డి' వ్యూహం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో




రాష్ట్రంలోనే తిరుపతి ఆధ్యాత్మికంగానూ, రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ప్రాంతంలో పట్టు సాధించాలన్నది పెద్దిరెడ్డి వ్యూహం. తన నియోజకవర్గం పుంగనూరులో ఉండడంతో చిత్తూరు జిల్లాకే పరిమితం అవుతామని, తిరుపతి జిల్లాపైనా పట్టు కోసం తాజాగా తన నియోజకవర్గంలోని రెండు మండలాలను (పులిచర్ల, రొంపిచెర్ల) తిరుపతిలో కలిపేందుకు వ్యూహం రచిస్తున్నారు. ఈ జిల్లాకు సంబంధించిన ఆర్‌కె రోజా అటు నగరిలోనూ, తిరుపతిలోనూ హవా కొనసాగిస్తున్నారు. రోజా తరహాలోనే తన నియోజకవర్గంలోని రెండు మండలాలనూ తిరుపతిలో కలుపుతూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వచ్చే ఎన్నికల్లో తిరుపతి జిల్లాలోనూ తన అనుచరుల్ని పెద్దిరెడ్డి నిలబెట్టబోతున్నారు. ముఖ్యంగా రోజాను ఆయన టార్గెట్ చేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి. రోజా నోటికి భయపడి అయినా ఆమెకు జగన్ రెడ్డి టిక్కెట్ ఇస్తారని.. కానీ రెబల్ ను నిలబెట్టి గెలిపించాలన్న పట్టుదలతో పెద్దిరెడ్డి ఉన్నారని అంటున్నారు. అందుకే తిరుపతి నుంచి తన మాటను అధికారులు వినాలంటే. ఆ జిల్లాలో తనకు ప్రోటోకాల్ రావాలని అనుకున్నట్లున్నారు.

జిల్లాల ఏర్పాటుకు ఎలా ప్రాతిపదిక లేదో. పుంగనూరు మండలాలను తిరుపతి జిల్లాలో మార్చడానికి కూడా అలా ప్రతిపాదిక లేదు. ఎప్పుడో వందేళ్ల కిందట ఆ రెండు మండలాలు తిరుపతి జిల్లాలో ఉండేవని చెప్పారు. ఆ మాటకొస్తే. ఇక జిల్లాల విభజన ఎందుకు ? వందేళ్ల కింద ఎలా ఉండేవో అలా చేస్తే పోలా అని ఎవరికైనా డౌట్ వస్తే. వైసీపీ దష్టిలో పిచ్చోళ్లనుకోవచ్చు. కారణం ఏదైనా పెద్దిరెడ్డి రోజా టార్గెట్ గా పెద్ద ప్లానే వేసినట్లున్నారు.

ట్రాన్స్ ప్లాంట్ అడ్వైజరీ కమిటి సభ్యులుగా స్విమ్స్ డైరెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి సిటి



కేరళ ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ కేరళ రాష్ట్రం కోజికోడ్ లో ఏర్పాటు చేస్తున్న ప్రతిష్టాత్మక ఆర్గాన్ టిష్యూ ట్రాన్స్ ప్లాంట్ ఇన్స్టిట్యూట్ అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్.వి.కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కేరళ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఈనెల 1వ తేది ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ ఆర్.వి. కుమార్ ప్రముఖ సి.టి.సర్జన్‌గా అందించిన విశిష్ట వైద్య సేవలు. అపూర్వ అనుభవాలను పరిగణలోనికి తీసుకొని పై సంస్థకు అడ్వైజరీ కమిటీ సభ్యులుగా ఎంపిక చేస్తూ కేరళ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.వి. కుమార్‌కి స్విమ్స్ యూనివర్శిటి ఫ్యాకల్టీ వైద్యులు. వివిధ విభాగాధిపతులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

రాయల్ రెడీమేడ్ షాప్ ప్రారంభం



ప్రజాశక్తి -కోట

కోట పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్ ఎదురుగా మెయిన్ రోడ్ నందు ప్రొప్రైటర్ షేక్. నదీమ్ భాష ఆధ్వర్యంలో రాయల్ రెడీమేడ్ హోల్‌సేల్స్, ఎక్స్ క్లూజివ్ మెన్స్ వేర్ షాపును ఈ నెల నాల్గో తేదీ సోమవారం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ప్రొప్రైటర్ నదీమ్ బాష మాట్లాడుతూ తమ వద్ద జీన్స్ ప్యాంట్స్, కాటన్ ప్యాంట్స్, జాగర్స్, టీషర్ట్స్, షార్ట్స్, ట్రాక్ పాయింట్, లుంగీలు, పంచెలు, టవళ్లు, బనియన్లు, డ్రాయర్లు, మగవారికి కావలసిన తదితర అన్ని వస్త్రములు లభిస్తాయన్నారు. నాణ్యతమైన వస్త్రములు అతి తక్కువ రేటుకు అందుబాటులో ఉంటాయన్నారు. కావున కోట, వాకాడు, చిల్లకూరు మండలాల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్



ఈనెల 9 వ తారీకున జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర అన్నారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు కాదని, దానిపై అప్పీలు ఉండబోదని తెలిపారు.

క్రీడాకారిణి జ్యోత్స్నకు అభినందనలు

పాకాల : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న జ్యోత్స్నను కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మొహిద్దీన్ బాష అభినందించారు. శనివారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. చెన్నైలో జరిగిన అండర్ 17 షటిల్ బ్యాడ్మింటన్‌లో కళాశాల విద్యార్థి జ్యోత్స్న ఫైనల్‌కు చేరింది. ఈ సందర్భంగా జ్యోత్స్న, కోచ్ బాబును, ఆమె తండ్రి వెంకటాద్రిలను ప్రిన్సిపల్ అభినందించారు.



దారి సమస్యకు శాశ్వత పరిష్కారం..!

పాకాల : దీర్ఘకాలికంగా నెలకొన్న దారి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. తుడ ఛైర్మన్ మోహిత్‌రెడ్డిని అడిగిన వెంటనే రూ.35 లక్షలు మంజూరు చేశారు. శనివారం రహదారి నిర్మాణానికి మోహిత్‌రెడ్డి భూమిపూజ చేశారు. గాదంకి పంచాయతీ గుడివారిపల్లి గ్రామానికి దీర్ఘకాలికంగా దారి సమస్య ఉంది. తిరుపతి బెంగుళూరు హైవే నుంచి గుడివారిపల్లికి వెళ్లే మార్గంలో రెండు గ్రామాలు ఉన్నాయి. గుంతగాదంకి, గుడివారిపల్లి గ్రామాలున్నాయి. అత్యవసరం అయితే ఈ గ్రామాలకు అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు. తమ గ్రామాలకు దారి సమస్య పరిష్కరించాలని అనేకమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. శనివారం భూమిపూజ కార్యక్రమంలో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాదంకి సర్పంచి గుడి సీతమ్మ, ఎంపిటిసి శ్యామల, శివకుమార్, హరినాథ్ పాల్గొన్నారు.

4-6 తేదీల్లో ఎస్వీ శిల్ప కళాశాల వర్క్‌షాపు

తిరుపతి సిటీ : టీటీడీకి చెందిన శ్రీ వేంకటేశ్వర సంప్రదాయ ఆలయ శిల్ప శిక్షణ సంస్థలో సెప్టెంబర్ 4 నుండి 6వ తేదీ వరకు సంప్రదాయ ఆలయ శిల్పకళలు – అనుబంధ అంశాలపై దక్షిణ భారతదేశంలోని నిష్ణాతులైన స్థపతులు, ఆగమ పండితులతో మూడు రోజులపాటు వర్క్‌షాప్ జరగనుంది. ఆలయ నిర్మాణం, శిల్పాల తయారీపై శిక్షణ పొందుతున్న విద్యార్థులకు, పూర్వవిద్యార్థులకు, ఆసక్తి గల ఇతర విద్యార్థులకు ఈ వర్క్‌షాప్‌లో మెళకువలు తెలియజేయడంతో పలు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పిస్తారు.

నిమ్మ, చీనీ కేంద్రంలో ఎడిఆర్

ప్రజాశక్తి - వెంకటగిరి రూరల్

పెట్లూరు నిమ్మ, చీని పరిశోధన స్థానం నందు నూతన వంగడాలు విశ్లేషణ చేసి రైతులకు అందించే కేంద్రానికి తిరుపతి జిల్లా డాక్టర్ వై యస్ ఆర్ హార్టీ కల్చర్ విశ్వావిద్యాలయం నుంచి ఏ డి ఆర్ వచ్చినట్లు విశ్వాసనీయ సమాచారం. ఇటీవల 'ప్రజాశక్తి' దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించి పరిశీలన చేయడానికి వచ్చారా...? లేక వేరే పనిమీద వచ్చారా అన్నది తెలియాల్సిఉంది. గతం లో పెట్లూరు నిమ్మ, చీని లో మొక్కలకు ఎంతో ప్రముఖ్యత ఉండేది కాని ప్రస్తుత పరిస్థితి లో రైతులకు నిమ్మ మొక్కలు ఎక్కడ అందుబాటులో లేక పోతే ఈ పరిశోధన కేంద్రానికి వచ్చే దుస్థితి వచ్చినట్లు నిమ్మ రైతులు వాపోతున్నారు .ఒకే రకం పంట వేయడం వల్లన రైతులకు నష్టం కల్గుతుందనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కొత్తవంగడాల తయారీకి శాస్త్రవేత్తలను నియమించడం జరుగుతుంది. కాని పెట్లూరు పరిశోధన స్థానం నందు గతం లో చేసిన "పులుసునిమ్మ" తప్ప నేటికీ నూతనంగా అంటుకట్టిన కొత్త రకం మొక్కలు చేయకపోవడం లో ఎక్కడ లోపమో...తెలియాల్సివుంది.

నేడు ఆడిటోరియం ప్రారంభం : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



తిరుపతి నగరంలో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన ఆడిటోరియంను ఆదివారం ప్రారంభిస్తున్నామని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్, తిరుపతి స్మార్ట్ సిటీ ఎం.డి హరిత ఐఎఎస్ తెలిపారు. తుడా కార్యాలయం వెనుక నిర్మించిన ఆడిటోరియంను శనివారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన అభివద్ధి పనుల్లో భాగంగా సుమారు 40 కోట్ల రూపాయలతో 600 మంది సీటింగ్ కెపాసిటితో కార్యక్రమాలు వీక్షించేందుకు వీలుగా ఆడిటోరియం, కమాండ్ కంట్రోల్ సెంటర్, ఆర్ట్ స్టూడియో, డిజైన్ స్టూడియోలను నిర్మిస్తున్నామని తెలుపారు. ఇప్పటి వరకు ఆడిటోరియం, ఆర్ట్ స్టూడియో పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డి.ఈ దేవిక ఉన్నారు.

శ్రీనివాస సేతు పనులు పరిశీలన


తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద శ్రీనివాస సేతుపై జరుగుతున్న పనులను శనివారం కమిషనర్ హరిత పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శ్రీనివాస సేతు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని, ఈ నెల 18న ముఖ్యమంత్రి చేతుల మీదుగా శ్రీనివాస సేతు మొత్తం ప్రాజెక్ట్ ప్రారంభించడం జరుగుతుందన్నారు. గడ్డర్లపై స్లాబ్ వేసే పనులను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు.

ఎస్వీయూ పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం



క్యాంపస్ : రాష్ట్ర ప్రభుత్వం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన పాలక మండలి సభ్యులను నియమించింది. ఇందులో భాగంగా నూతన పాలక మండలి సభ్యులగా నియమితులైన వారికి విసి ఆచార్య కే. రాజారెడ్డి నియామక పత్రాలను అందజేశారు. సెనెట్ హాల్లో నియామక పత్రాలు అందుకున్న సభ్యులు ఆచార్య సమ కిరణ్, ఆచార్య పద్మనాభం, డాక్టర్ సుగుణ రెడ్డి, డాక్టర్ మంజుల, డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి, సామాజిక కార్యకర్త జ్యోతి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య కే.రాజారెడ్డి మాట్లాడుతూ వర్సిటీని సమర్థవంతంగా ముందుకు నడిపించడంలో పాలక మండలి సభ్యుల పాత్ర కీలకమన్నారు. సభ్యులందరూ విభిన్న రంగాలకు చెందిన సబ్జెక్టు నిపుణులుగా పరిగణించి రాష్ట్ర ప్రభుత్వం వారి నియామకాలు వర్సిటీకి సూచించిందన్నారు. వర్సిటీ అభివద్ధిలో పాలక మండలి సభ్యుల పూర్తి సహాయ, సహకారాలు అవసరం అన్నారు.

ఎన్‌సిసి క్యాడేట్లకు ట్రెక్కింగ్‌లో శిక్షణ



క్యాంపస్ : తిరుపతిలోని ఆర్ అండ్ వి రెజిమెంట్ ఎన్సిసి క్యాడెట్లకు కమాండర్ ప్రకాష్ కుమార్ ఆధ్వర్యంలో ట్రెక్కింగ్ పై శిక్షణను నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులు గుర్రాలపై స్వారీలను చేస్తూ అడవిలో ఏ విధంగా ట్రెక్కింగ్ చేయాలో సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి విపత్కర పరిస్థితులలో అయినా అడవి మార్గంలో గుర్రాలపై వెళ్లేటప్పుడు ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. ఈ ట్రెక్కింగ్ శిక్షణ ద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా పరిణతి చెంది, దేశ అభివద్ధిలో కీలకంగా వ్యవహరించేందుకు ఉత్తమ పౌరుడిగా సమాజంలో నివసించేందుకు కషి చేస్తాయన్నారు. విద్యార్థులు ట్రెక్కింగ్ లో ధైర్య సాహసాలు ప్రదర్శించడం, పట్టుదల, కార్యదీక్షత, అంకుటిథ దీక్ష వంటి విషయాలను నేర్చుకోవడం జరుగుతుందన్నారు.

పద్మావతి వర్సిటీలో పాలక మండలి సభ్యుల నియామకం

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పాలకమండలి నూతన సభ్యులుగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం మహిళా వర్సిటీ నూతన పాలకమండలి సభ్యులను నియమించింది. ఈ మేరకు పాలక మండలి సభ్యులు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని అప్లైడ్ మైక్రో బయాలజీ భాగానికి చెందిన ఆచార్య పి. సువర్ణలతాదేవి, హ్యూమానిటీ సోషల్ సైన్స్ ఆచార్య కె.అనురాధ, గణిత విభాగానికి చెందిన విశ్రాంత ఆచార్యులు ఆచార్య ఏ.లీలారత్నం, విశ్రాంత అధ్యాపకులు ఆచార్య కె. ఉమాదేవి, మహిళా వర్సిటీ మాజీ రెక్టార్ ఆచార్య డి శారద, శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని గణిత విభాగానికి చెందిన విశ్రాంత ఆచార్యులు ఆచార్య కె.సువర్ణ లను నియమించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి. భారతి, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజనీ లు నూతన పాలకమండలి సభ్యులకు అభినందనలు తెలిపారు.

వర్సిటీలో సిబ్బంది పాత్ర కీలకం : విసి ఆచార్య కె.రాజారెడ్డి

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం అభివద్ధికి బోధన, బోధనేతరసిబ్బంది సహాయ సహకారాలు మరువలేనివని, వారి కషి అమోఘమని ఉపకులపతి ఆచార్య కే.రాజారెడ్డి పేర్కొన్నారు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 69వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శ్రీనివాస ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఓఎండీ హుస్సేన్, అధికారులు వర్సిటీలోని పరిపాలన భవనం ఎదుట ఉన్నటువంటి వర్సిటీ వ్యవస్థాపక ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం, నీలం సంజీవరెడ్డి, ప్రధాన గ్రంధాలయం ఎదుట ఉన్న మహాత్మా గాంధీజీ, ఆర్చ్ ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో విసి ఆచార్య రాజారెడ్డి మాట్లాడుతూ వర్సిటీ అన్ని రంగాల్లో అభివద్ధి చెందడంలో ప్రతి ఒక్కరి సహకారం కీలకమన్నారు. వర్సిటీ బోధన, పరిశోధన రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఆచార్యులు, పరిశోధకులు కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు, బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీకే సుబ్రహ్మణ్యం, నెల్లూరు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ విసిచే పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ తెలుగులో ఉన్న "చక్రపాణి" గ్రంథాన్ని ఆంగ్లంలోకి అనువదించిన పుస్తకాన్ని శనివారం ఉపకులపతి ఆచార్య దేపూరి భారతి, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని ఆవిష్కరించారు. తెలుగులో వెలగా వెంకటప్పయ్య రచించిన "చక్రపాణి" అనే పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. "మేకర్స్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్" అనే సిరీస్ కింద పలు భారతీయ భాషలకు చెందిన ప్రముఖ సాహితీవేత్తల చరిత్రలను పుస్తకాల రూపంలో ఆయా భాషలలో ప్రచురించింది. విశ్వవిద్యాలయం ఆంగ్ల శాఖకు చెందిన ఆచార్య హరిపద్మరాణిని కేంద్ర సాహిత్య అకాడమీ కోరింది. ఆమె ఆంగ్లంలోకి తర్జుమా చేసిన ఈ పుస్తకాన్ని ఇప్పుడు ప్రచురించారు. ఈ సందర్భంగా వారు ఆచార్య హరి పద్మ రాణిని అభినందించారు.

వృద్ధాశ్రమంలో పవన్ పుట్టినరోజు వేడుకలు

పుత్తూరు టౌన్ : జనసేన పార్టీ వ్యవస్థాపకులు పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ 53వ జన్మదినం సందర్భంగా వయోవృద్ధుల ఆశ్రమంలో నిర్వహించారు. ఎపి రాష్ట్ర కాపు సంక్షేమ ఆర్గనైజర్ సెక్రటరీ పి.గోపిరాయల్ ఆధ్వర్యంలో బర్త్‌డే కేక్‌కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జి.క్రిష్ణయ్య, కె.రమేష్‌బాబు, ఉదయ్‌యాదవ్ పాల్గొన్నారు.

తిరుపతి మంగళంలో.. జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి మరిప్రసాద్ సూచనలతో సీనియర్ నాయకులు కృష్ణయ్య, జిల్లాకార్యదర్శి ఆనంద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. **శ్రీకాళహస్తిలో...** నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోటా వినుత ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలోరక్తదాన శిబిరం నిర్వహించారు. చంద్రబాబు, రాఘవయ్య, సాయికిరణ్ పాల్గొన్నారు.

పాత పల్లూరులో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

నగరి నియోజకవర్గం, పుత్తూరు మున్సిపాలిటీ, మొదటి వార్డు, కొత్త తిమ్మాపురం గ్రామంలో సుమారు 140 కుటుంబాలు, 528 మంది ఓటర్లు ఉన్నారు, ఈ ఓటర్లలో 50శాతం మహిళలు, 65శాతం వయోవద్ధుల ఓటర్లు ఉన్నారు, ఓటర్లు రెండు కిలోమీటర్ల దూరంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లాలంటే హైవే దాటాలని, 150 మీటర్ల దూరంలో ఉన్న పాత పల్లూరు ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పుత్తూరు తహశీల్దార్ పరమేశ్వర స్వామికి గ్రామస్తులు. వినతి పత్రం అందజేశారు. చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగం రెడ్డి, పుత్తూరు పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు ఏలుమలై రెడ్డి, బిసి సెల్ ఉపాధ్యక్షులు సంతోష్, గ్రామస్తులు చిరంజీవి, మదన్, మురుగన్, నారాయణ, వెంకటముని, రాజేంద్రన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార వారోత్సవాలు

గూడూరు : అర్బన్ ఐసిడిఎస్‌లో రాణీపేట అంగన్‌వాడీ కేంద్రం-2లో జాతీయ పోషకాహార వారోత్సవాలను సిడిపిఒ షేక్ మహబూబి నిర్వహించారు. ఎసిడిపిఒ జ్యోతికిరణ్ మాట్లాడుతూ పౌష్టికాహారంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని తల్లులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి.మంజుల పాల్గొన్నారు.

కోటలో.. బాలింతలు, గర్భిణులు, పిల్లలు సరైన పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవిత అన్నారు. కోట ఐసిడిఎస్ పరిధిలోని చిట్టేడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు శనివారం జరిగాయి. పిల్లల్లో రక్తహీనత తలెత్తకుండా ఉండాలంటే పౌష్టికాహారాన్ని తప్పకుండా తసుకోవాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలు కలిగిన ఆహార పదార్థాలను తప్పకుండా తీసుకోవాలన్నారు.

బిఎన్ కండ్రిగలో.. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వైఎస్ఆర్ పౌష్టికాహారంపై శనివారం కుక్కంబాకం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు చెంచులక్ష్మి, యమునలు అవగాహన సమావేశం నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గుతుందని, చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం అందజేస్తున్నామని తెలిపారు.

వర్షంతో నేలవాలిన వరి

బిఎన్ కండ్రిగ : గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షంతో వరి పంట దెబ్బతింది. దాదాపు 150 ఎకరాల వరిపైరు నేలవాలిందని రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని నీర్పాకోట, కాంపాళెం, కుక్కంబాకం, కనమనంబేడు గ్రామాల్లోని 150 ఎకరాల వరి పంట నీట మునిగింది. కోత దశకు వచ్చిన పంట నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

బిసిలను సీఎం చేయాలి: మల్లికార్జున

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

బీసీలను ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే రాజ్యాధికారం సాధించినట్లని కిసాన్ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కురబ మల్లికార్జున అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ సమైక్యత, దేశ రక్షణ, దేశ భద్రత లక్ష్యంగా, మహాత్మా గాంధీ సిద్ధాంతాలను అనుసరిస్తూ పనిచేస్తున్నామన్నారు. వ్యవసాయ రంగాన్ని అగ్రగామిగా చేయడమే లక్ష్యమన్నారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం

ప్రజాశక్తి -కోట

నవధాన్యాల సాగుతో భూమి సారవంతంగా ఉంటుందని గూడలి ఉప సర్పంచ్ పల్లెమల్లు.విజయసారధి రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కోట మండలంలోని గూడలి పంచాయతీ పరిధిలో ఉన్న చంద్రశేఖరపురంలో ప్రకతి వ్యవసాయ విభాగంలో భాగంగా ఆర్ బి కే లో జగనన్న నవ ధాన్యాల కిట్లును అందజేశారు. అనంతరం పల్లెమల్లు.విజయసారధి రెడ్డి మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో అటు భూసారం పెరగడంతో పాటు మన ఆరోగ్యం బాగుంటుందని అన్నారు. మాస్టర్ ట్రైనర్ భాగ్యలక్ష్మి,రైతులు ఉన్నారు.



పల్లెవీధి షిరిడి సాయిబాబా ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి నగర పరిధిలోని పల్లె వీధిలో గల శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ 18 వ వార్షికోత్సవాన్ని ఆలయ గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర రవాణా శాఖ సభ్యులు ఎం. సునీల్ చక్రవర్తి, స్థానిక కార్పొరేటర్ నరసింహ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం హోమ కార్యక్రమాన్ని నిర్వహించి, 500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సతీష్, కిరణ్, శ్రీనివాసులు, నారాయణ అర్చకులు, కాశీ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా ముగ్గురు ప్రమాణ స్వీకారం

తిరుమల : టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా సీతారెడ్డి, విశ్వనాధరెడ్డి, సత్యనారాయణ శనివారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు.శ్రీవారి ఆలయంలో స్వామివారి సన్నిధిలో వీరి చేత జేఈవో వీరబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం వీరికి జేఈవో శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవోలు లోకనాథం, గోవిందరాజన్ పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర ఛైర్‌పర్సన్ పుట్టినరోజు వేడుకలు

గూడూరు టౌన్ : పట్టణంలోని కరణాలవీధిలో ఉన్న వైకాపా నేత పోణకా శివకుమార్ రెడ్డి నివాసంలో స్వచ్ఛఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పోణకా దంపతుల అభిమానులు, వైకాపా నాయకులు, పీ.ఎస్సార్ సంస్థల ఉద్యోగులందరూ కలిసి ఇంటివద్ద భారీ కేక్ ను కట్ చేశారు. పోణకా దంపతులు స్థానికంగా లేనప్పటికీ వారి అభిమానులు వేడుకలు నిర్వహించారు. అనంతరం సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు గోపాల్ యాదవ్, ముని,సాయి, సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చంగాళమ్మ గుడి వద్ద ఆటోస్టాండ్ ఏర్పాటు



సూళ్లూరుపేట : శ్రీ చంగాళమ్మ పరమేశ్వరి గుడి దగ్గర తిరుపతి జిల్లా ఆటో యూనియన్ విభాగాన్ని యూనియన్ కార్యదర్శి టి. మురళి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికుల తిరుపతి జిల్లా అధ్యక్షులు యస్.అల్లెయ్య, సూళ్ళూరుపేట మండలం సిఐటియు నాయకులు.కె. లక్ష్మయ్య, చంద్రశేఖర్, భాస్కర్, నాగరాజు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల వినతి



పుత్తూరు టౌన్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు వారికే కేటాయించాలని సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాష్, డి.శంకర్‌లకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలో పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు చట్టం పాలకుల తీరువల్ల నిర్వీర్యమయ్యిందన్నారు. సంక్షేమ బోర్డు నిధులు 1150 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. కేరళ, ఢిల్లీ, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లుగా పెన్షన్, స్కాలర్‌షిప్పు, ప్రమాదబీమా, సహజ మరణాలు, వితంతు పింఛన్, వివాహ కానుక, పిల్లలకు సైకిళ్లు తదితరాలను అందజేయాలన్నారు. పెండింగ్ క్లైమ్‌లన్నీ పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నందయ్య, నరసింహులు పాల్గొన్నారు.

హంతకులను అరెస్టు చేయాలి :కెవిపిఎస్



సత్యవేడు కుమార్‌ను హత్యచేసిన హంతకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుల ఆధ్వర్యంలో ఎంఎల్ఎకు వినతిపత్రం ఇచ్చారు. రాచపాళెంలో కోనాళమ్మ గుడిలో హుండీ డబ్బుల లెక్కలు అడగడాన్ని జీర్ణించుకోలేక పెత్తందారులు ఆరుగురు కలిసి దళిత యువకుడు కుమార్‌ను ఇనుపరాడ్‌తో స్పృహ కోల్పోయేలా కొట్టి గాయపరిచారన్నారు. చికిత్స పొందుతూ కుమార్ మృతిచెందాడన్నారు. కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తన భర్త కోనాళమ్మ గుడిలో వస్తున్న ఆదాయానికి సంబంధించి దళితవాడకూ వాటా కావాలని అడిగినందునే తట్టుకోలేకపోయారని వాపోయింది. దళిత ఎంఎల్ఎ స్పందించి కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కన్వీనర్ అరుణాచలం డిమాండ్ చేశారు. సోమవారం 'చలో సత్యవేడు'కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. హత్య చేసిన ఆరుగురిపై ఐపీసీ సెక్షన్ 300, 302 సెక్షన్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి యాక్ట్ అండర్ సెక్షన్ 3(2) (1)(1) కేసు నమోదు చేసి హంతకులను కఠినంగా శిక్షించాలన్నారు.

ఏర్పేడులో రోడ్డు ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి -ఏర్పేడు మండల కేంద్రమైన ఏర్పేడు గ్రామ పంచాయతీలోని అశోక్ నగర్ కు వెళ్లే మార్గంలో శనివారం రోడ్డు ఆక్రమణలను తొలగించారు. అశోక్ నగర్ గ్రామస్తుల అభ్యర్థన మేరకు ఏర్పేడు గాండ్ల వీధి నుంచి అశోక్ నగర్ కు వెళ్లే దారిని సర్వే చేపట్టి ఆక్రమణలను తొలగించారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్ల పాలెం శివయ్య ఆధ్వర్యంలో అశోక్ నగర్ దారి సర్వే చేపట్టారు. సర్వేలో ఆక్రమణలను గుర్తించి అప్పటికప్పుడే జెసిబి సహాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తిరుమల రావు, దట్టం బాలాజీ, కలపాటి గురవమ్మ పాల్గొన్నారు.

డివైడర్ ను ఢీకొన్న బైక్ : ఒకరికి తీవ్ర గాయాలు

దొరవారిసత్రం : మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ సమీపాన ఉన్న జాతీయ రహదారి డివైడర్ ను శనివారం అక్కరపాకు గ్రామానికి చెందిన గోవర్ధన్ బైకుతో ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు గోవర్ధన్ వంట మాస్టర్ గా పనిచేస్తూ జీవనం సాగిసుతన్నాడు. వంట పని ముగించుకుని బైక్ పై తన స్వగ్రామానికి వెళుతూ ఉండగా అదుపుతప్పి డివైడర్ ను ఢీ కొన్నాడు దీంతో అతనికి తలపై బలమైన గాయమయ్యింది. వెంటనే 108 వాహనానికి ఫోన్ చేసి క్షతగాత్రుని చికిత్స కోసం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబాన్ని గెలిపించాలి : సైకాలజిస్ట్

పుత్తూరు టౌన్ : తల్లిదండ్రులను, కుటుంబాన్ని గెలిపించలేకపోతే మన జీవితం వృథా అవుతుందని సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాస తరగతులను ఏర్పాటు చేశారు. ప్రత్యూష సుబ్బారావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ చిన్నప్పటి మంచి అలవాట్లు చిరకాలం ఉంటాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి, గోపాల్‌రెడ్డి, టి.నరసింహులు, రోశయ్య పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలి: జ్ఞాన రంజన్ సారంగి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



డిజిటల్ లావాదేవీలపై వినియోగదారులు మొగ్గు చూపేలా ప్రోత్సహించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ జ్ఞాన రంజన్ సారంగి పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి కరకంబాడి మార్గంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళం శాఖ, కరకంబాడి శాఖల సమన్వయంగా మంగళం శాఖ కార్యాలయంలో వినియోగదారులకు క్యూఆర్ కోడ్ పాడ్లను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిఎం జ్ఞాన రంజన్ సారంగి మాట్లాడుతూ డిజిటల్ ఇండియాలో భాగంగా నగదు రహిత లావాదేవీలపై వినియోగదారులు మక్కువ చూపేలా తగిన ప్రోత్సాహన్ని అందిస్తూ పూర్తిస్థాయి డిజిటల్ లావాదేవీలు జరిగేలా చూడాలని సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా పీఎం స్వానిధి, ముద్ర, నారికి భారీ ద్వారా రుణాలను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ఖాతాదారులకు ఎల్లవేళలా అన్ని పనిరోజుల్లో బంగారం, పంట, వ్యాపారం వ్యక్తిగత అవసరాలకు లోన్లు మంజూరు చేస్తున్నామన్నారు. గహ వాహన రుణాలకు అదనపు చార్జీలు లేకుండా తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామన్నారు. వినియోగదారులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. మంగళం శాఖ బ్రాంచ్ మేనేజర్ కెవి.రమణ మాట్లాడుతూ తమ శాఖ పరిధిలోని 9500 మంది ఖాతాదారులకు ఈ క్యూఆర్ కోడ్ లను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ జి.రాంప్రసాద్, కరకంబాడి శాఖ బ్రాంచ్ మేనేజర్ సరిత, బిఆర్ఎం విశ్వనాథరెడ్డి, రీజనల్ కార్యాలయం ఎస్ఎస్డి పార్థసారథి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.